క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మోపిదేవి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. మోపిదేవి పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సభ.. సర్పంచ్ నందిగం మేరీరాణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ, పరిసరాలు–పరిశుభ్రత పాటించాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరుచేయాలని, ప్రతి ఇంటా బాత్రూంలు శుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. పీఓ పాండు రంగారావు, ఎంపీటీసీ కొమ్ము పవన్, గ్రామ కార్యదర్శి మల్లేశ్వరావు, పంచాయతీ పాలక వర్గ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



అవనిగడ్డ: అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి నేరెళ్ల పాలెం వరకూ రూ.76 లక్షలతో నిర్మించనున్న వంతెన రోడ్డుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.3.16 కోట్ల వ్యయంతో ఆరు కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమ, ఎంపీడీవో మరియాదేవి, పంచాయతీరాజ్ డీఈ పగడాల సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో ఆరోగ్యంపై అవగాహన ఉండాలి



మచిలీపట్నం అర్బన్: విద్యార్థి దశలోనే ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని మచిలీపట్నం మహిళా పీఎస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో వైద్యశాఖ, దివ్య డయాగ్నొస్టిక్ సెంటర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బ్లడ్ గ్రూపింగ్, హెచ్‌బీ శాతం పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మి, ఏఎన్ఎంలు, దివ్య డయాగ్నొస్టిక్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ లంకిశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల బంద్



మచిలీపట్నంఅర్బన్: విద్యాశాఖ అధికారుల ఏకపక్ష వైఖరికి నిరసనగా మచిలీపట్నంలో పలు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను గురువారం మూసివేశారు. ప్రభుత్వ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, గుర్తింపుల రద్దు బెదిరింపు, షోకాజ్ నోటీసుల జారీ, ధ్రువీకరణలేని ఫిర్యాదుల ఆధారంగా పక్షపాత తనిఖీలు నిర్వహించడం వంటి చర్యలకు వ్యతిరేకంగా విద్యాసంస్థలు ఒక రోజు బంద్ పాటించాయి. ఆర్టీఈ 12(1)(సి) ప్రకారం అడ్మిషన్లను బలవంతంగా అమలు చేయడం, విద్యా సంస్థల పరిపాలనలో జోక్యం చేసుకోవడంతో నిర్వాహకులు, సిబ్బంది ప్రభావితమవుతున్నారని చైతన్య, నారాయణ విద్యాసంస్థల యాజమాన్యాలు వెల్లడించాయి.

9న మోపిదేవి దేవస్థానంలో కానుకల లెక్కింపు

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 9వ తేదీ బుధవారం ఉదయం 8 గంటలకు హుండీలు లెక్కించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించే కానుకల లెక్కింపులో పాల్గొన దలచినన వారు డ్రస్ కోడ్‌తో రావాలని సూచించారు. లెక్కింపు కారణంగా ఆరోజు బుధవారం నిర్వహించే స్వామివారి నిత్యశాంతి కల్యాణం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

మైనార్టీలకు సంక్షేమ భవన్ నిర్మించండి

మచిలీపట్నంటౌన్: ఏపీ రాజధానిలో ప్రభుత్వం ముస్లిం మైనార్టీ సంక్షేమ భవనం నిర్మించాలని ముస్లిం సంక్షేమ సంఘ ఉమ్మడి రాష్ట్ర అధికార ప్రతినిధి సద్రుద్దీన్ ఖురేషి రాష్ట్ర ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీలు సంక్షేమం గురించి చెప్పే మాటలు, హామీలు కోటలు దాటుతున్నా ఆచరణలో గడప కూడా దాటడం లేదన్నారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం కబ్జాల్లో ఉన్న వేలాది ఎకరాల వక్ఫ్ భూములను పెద్దల కబంద హస్తాల నుంచి స్వాధీన పర్చుకొని పేద ముస్లిం కుటుంబాలకు గూడు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ముస్లిం మైనార్టీల రుణాలు పెంచాలని కోరుతూ సచార్ కమిటీ దేశంలోని మైనారిటీల సంక్షేమం కోసం ఇచ్చిన సిఫార్సులను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఖాళీ ప్లాట్లు.. ప్రజల పాట్లు

- చల్లపల్లి నారాయణరావునగర్ నిరుపయోగంగా ఖాళీ స్థలాలు
- సర్పాలు, దోమలకు ఆవాసం
- భయపడుతున్న కాలనీ వాసులు



నారాయణరావునగర్‌లోని ఖాళీ స్థలంలో మురుగునీరు, పిచ్చి మొక్కలు

చల్లపల్లి: చల్లపల్లి నారాయణరావునగర్ కాలనీలోని ఖాళీ ప్లాట్లతో ప్రజలు పాట్లు పడుతున్నారు. ఇవి దోమలు, పాములకు ఆవాసంగా మారుతున్నాయి. నారాయణరావునగర్‌లో 1996లో ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. ఆ సమయంలోనే భవిష్యత్ అవసరాల కోసం కాలనీలో ఐదు చోట్ల స్థలాలను ఖాళీగా వదిలిపెట్టారు. దశాబ్దాలు గడుస్తున్నా ఆ ఖాళీ స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేయలేదు. దీంతో అవికాస్తా పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలతో నిండిపోయాయి.

పల్లపు ప్రాంతాల్లోకి

కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పల్లంగా ఉన్న ఈ ఖాళీ స్థలాల్లోకే నీరు చేరుతోంది. పిచ్చిమొక్కలు, విష పురుగులు, దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. విష పురుగులు రోడ్లపైకి వస్తున్నాయని రాత్రిళ్లు బయటకు రావాలంటే భయమేస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఓ వైపు ముక్కుపుటాలదిరేలా కంపు, మరో వైపు దోమకాట్లతో భయాందోళనలు వ్యక్తంచేస్తున్నారు. సర్పాలు, దోమలతో ఎప్పుడు ఎటువంటి ముప్పు వాటిల్లుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లోని ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను తొలగించాలని, దోమలు ఆవాసం ఏర్పాటుచేసుకునేందుకు అనువుగా మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని నారాయణరావునగర్ కాలనీ వాసులు కోరుతున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి పక్కన ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు

పెరిగిన పిచ్చి మొక్కలు



నారాయణరావునగర్ కాలనీ ప్రధాన రహదారి పక్కన ముళ్ల చెట్లు

చల్లపల్లి–పామర్రు ప్రధాన రహదారి నుంచి నారాయణరావునగర్ కాలనీకి వచ్చే ముఖద్వారం వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. లోపలికి వెళ్లే దారి లేకుండా దట్టంగా ఉన్నాయి. ముళ్ల కొమ్మలు రహదారిపైకి వచ్చి రాకపోకలు సాగించేవారికి ఇబ్బందులు కల్గిస్తున్నాయి. కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంకు వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి అల్లుకుపోయాయి. ప్రభుత్వాస్పత్రి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. ప్రభుత్వ మండల కార్యాలయాల వెనుక బైపాస్ రోడ్డుకు అనుకున్న ఉన్న ఖాళీ ప్రాంతం ఒక్క మండు వేసవిలో తప్ప మిగతా అన్ని రోజులూ మురుగునీటితోనే నిండి ఉంటుంది.



- **వైఎస్ జగన్‌కు వంశీ కృతజ్ఞతలు**

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం కలిశారు. సతీమణి పంకజశ్రీతో కలిసి గుంటూరు జిల్లా తాడేపల్లిలోని జగన్ నివాసానికి వెళ్లిన వంశీ కష్టకాలంతో తనకు అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మంత్రి కొల్లుకు సమస్యల ఏకరువు

మురికిగా తాగునీరు, వెలగని వీధిదీపాలు



మచిలీపట్నంలో మంత్రి రవీంద్రకు సమస్యలు వివరిస్తున్న మహిళలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 48వ డివిజన్ నిజాంపేట వడ్డెరకాలనీ ప్రజలు ఆ ప్రాంతానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రకు సమస్యలను ఏకరువు పెట్టారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో భాగంగా మంత్రి కొల్లు రవీంద్ర అధికారులతో కలసి బుధవారం రాత్రి ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా రెండు నెలలుగా వీధి దీపం వెలగక నానా ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని..., కుళాయిల ద్వారా తాగునీరు మురికిగా వస్తున్నాయని ఆ ప్రాంత మహిళలు మంత్రికి ఏకరువు పెట్టారు. దీనికి స్పందించిన మంత్రి రవీంద్ర మున్సిపల్ ఎలక్ట్రికల్ ఏఈ గోపిశెట్టి శేఖర్‌పై మండి పడ్డారు. నగరంలో వీధి దీపాల నిర్వహణ బాగోలేదనే ఫిర్యాదులు వస్తున్నాయని 100 శాతం లైట్లు వెలగకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీ అన్ని ఫైల్స్‌పై సంతకాలు ఆపకుండా పెడుతున్నాను.. అయినా రెండు నెలలుగా వీధి దీపాలు వెలగకపోవడం ఏంటని కమిషనర్ బాపిరాజు ఏఈ శేఖర్‌ని ప్రశ్నించారు. తాగునీరు మురికిగా రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి రవీంద్ర అధికారులను ఆదేశించారు.

ఐదుగురు వీఆర్వోలకు ఉద్యోగోన్నతి



బదిలీ అయిన వీఆర్వోలను సన్మానించిన ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్ తదితరులు

పెడన: మండలంలోని వార్డు, గ్రామ సచివాలయాల్లో గ్రేడ్–2 వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఐదుగురు గ్రేడ్–1 వీఆర్వోలుగా ఉద్యోగోన్నతి పొంది బదిలీ అయ్యారు. పట్టణంలోని 6, 7, 8వ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న నాగాంజనేయులు పెడన మండలం కాకర్లమూడికి, కె.బేబీ చల్లపల్లి మండలం పురిటిగడ్డకు, మణికంఠ బందరు మండలం ఎస్ఎన్ గొల్లపాలెంకు బదిలీ అయ్యారు. మడక గ్రామ సచివాలయం నుంచి పి.శ్రావణిరమ్య పెడన మండలం చోడవరానికి, పుల్లపాడ నుంచి శివపార్వతీ గుడ్లవల్లేరు మండలం వేమవరంకు బదిలీ అయ్యారు. వీరంతా రిలీవ్ అయ్యి వారి స్థానాల్లో విధుల్లో చేరారు. గురువారం మధ్యాహ్నం వీరికి ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి ఆర్ఐ ఇ.విజయలక్ష్మి, మండల సర్వేయర్ కృష్ణదాస్ తదితరులు వీరికి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు.

ఫ్యూజ్‌బాక్స్‌ను ఎత్తులో పెట్టారు

సాక్షి ఎఫెక్ట్



ఫ్యూజ్ బాక్స్ ఎత్తును పెంచుతున్న విద్యుత్ సిబ్బంది

కోడూరు: ప్రమాదకరంగా మారిన విద్యుత్ ఫ్యూజ్ బాక్స్‌ను ఆ శాఖ అధికారులు ఎట్టకేలకు ఎత్తులో పెట్టారు. స్థానిక ఇండోర్ స్టేడియం సమీపంలోని డ్రెయిన్ పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా ఉన్నాయంటూ 'సాక్షి' గురువారం కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన విద్యుత్ ఏఈ గోపీచంద్ సిబ్బందితో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్కన ఉన్న ఫ్యూజ్ బాక్స్ కిందకు ఉండడాన్ని గమనించారు. వెంటనే సిబ్బందితో ఫ్యూజ్ బాక్స్‌ను గతంలో కంటే మూడు అడుగుల మేర ఎత్తులో పెట్టారు. ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఏఈ చెప్పారు.

సాగునీటి ప్రవాహానికి అడ్డుగా చెత్త

అయోధ్య(మోపిదేవి): కాలువ చివరి భూములకు సాగునీరు అందని ద్రాక్షగానే ఉంటోందని రైతు పండలనేని శివప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల కేఈబీ కెనాల్ నుంచి 11వ నంబర్ కాలువకు సాగు, తాగునీరు విడుదల చేశారు. కాలువలు మరమ్మతులు చేయకపోవడంతో చెత్త చెదారం కొట్టుకువచ్చి అయోధ్య గుండం వంతెన వద్ద పట్టుకుందని తెలిపారు. దీన్ని తొలగించి కాలువ కింద సాగులో ఉన్న సుమారు 2 వేల ఎకరాలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను రైతులు కోరుతున్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కోనేరుసెంటర్: విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్టేట్ బ్యాంక్ ప్రతినిధులు పలువురు పేర్కొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల నాలుగో సంవత్సరం విద్యార్థులకు నేటి బ్యాంకింగ్ వ్యవస్థలో ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయి, వాటిని అందిపుచ్చుకునే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి పలువురు ప్రతినిధులు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలను వివరించారు. మచిలీపట్నం స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ శిక్షణ విభాగం డైరెక్టర్ ఆర్వీ హనుమంతరావు బ్యాంకింగ్ రంగంలో విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయాలన్నీ విశదీకరించారు. మరో శిక్షణ నిపుణుడు రాంప్రకాష్ బ్యాంకింగ్ రంగంలో ఉపాధి అవకాశాలకు సంబంధించి రాత పరీక్షకు కావలసిన కోర్సులు, ఆ రంగంలోకి వస్తే ఉండే ఉద్యోగ భద్రత.. ఆకర్షణీయమైన జీతభత్యాలపై అవగాహన కల్పించారు. కృష్ణా యూనివర్సిటీలోని విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ మీద బ్యాంకింగ్ రంగంలో జరిగే డిజిటల్ మోసాలపై మరిన్ని వర్క్‌షాప్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ మురళీకృష్ణ, హెచ్ఆర్ మేనేజర్ వివేక్ తేజ్, వర్సిటీ క్యాంపస్ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ మహేష్ కుమార్, కళాశాలలోని బోధన సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులారా.. హక్కులను కాపాడుకుందాం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష నేతలు



చల్లపల్లి గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు

చల్లపల్లి: కార్మికులారా.. హక్కులను కాపాడుకుందామని రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త పిలుపు మేరకు ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష నేతలు కార్మికులకు పిలుపునిచ్చారు. గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఐ ఎంఎల్, సీపీఎం నాయకులు గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి వై.మధు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికుల ఉద్యోగ భద్రత, తమ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. మహిళలకు రాత్రి వేళల్లో పని షిఫ్టులు, పనిగంటలు పెంపు వంటి పనిభారాలు ఈ కోడ్‌లతో ఉత్పన్నమవుతాయని పేర్కొన్నారు. సమావేశంలో పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

ప్రపంచ మెకానిక్ దినోత్సవం



ట్రాక్టర్ మెకానిక్ ఉప్పు శివాజీని సన్మానిస్తున్న డానీ, శ్రీనివాస్ తదితరులు

బంటుమిల్లి: ప్రపంచ మెకానిక్ దినోత్సవం పురస్కరించుకుని శ్రీవినాయక మోటార్ సైకిల్ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వేడుకలను నిర్వహించారు. విజయగణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కోసి అభినందనలు తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావును శాలువతో సత్కరించి వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ కార్యాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని, ప్రపంచ మెకానిక్ దినోత్సవం రోజును సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బాజీ, గంగ, డానీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి : స్థానిక ఆటోనగర్‌లో గురువారం చల్లపల్లి మోటార్ సైకిల్ మెకానికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్‌ల దినోత్సవాన్ని ఘనంగా చేసుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, ఉపసర్పంచ్ ముమ్మనేని రాజ్‌కుమార్(నాని) కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ ట్రాక్టర్ మెకానిక్ ఉప్పు శివాజీని ఈసందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీడబ్ల్యూ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కేఎస్ ఘోరి, చల్లపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రేమ్ చంద్, టి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె



బంటుమిల్లి: బంటుమిల్లిలోని శ్రీ దుర్గానగర్‌లో శ్రీ కనకదుర్గమ్మకు ఆర్యవైశ్య సంఘం వాసవీ క్లబ్ సభ్యులు గురువారం సంప్రదాయ పద్ధతిలో ఆషాఢసారెను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, పూలు, మిఠాయిలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

240 కేజీల రేషన్ బియ్యం పట్టివేత

చల్లపల్లి: అక్రమంగా తరలిస్తున్న 240 కేజీల రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. చల్లపల్లికి చెందిన వి.హరికృష్ణ ఇంటి వద్ద రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం అందుకున్న డీఎస్పీ ప్రత్యేక పోలీసు బృందం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 240 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

సమష్టి కృషితో 'స్వచ్ఛ సర్వేక్షణ్'

కొడాలి(ఘంటసాల): గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డు సాధించాలంటే సమష్టి కృషితోనే సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి రజావుల్లా అన్నారు. ఘంటసాల మండలం కొడాలి గ్రామ పంచాయతీ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2025కు ఎంపికవ్వగా పంచాయతీ పరిధిలో జరుగుతున్న వివిధ పనులు, పారిశుద్ధ్య పనులు, పాఠశాలలను రజావుల్లా గురువారం పరిశీలించారు.

నారుమడుల్లో కలుపు నివారణ చర్యలు

ఘంటసాలపాలెం(ఘంటసాల): నారుమడుల్లో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి కె.పద్మజ రాణి రైతులకు సూచించారు. ఘంటసాల మండలం ఘంటసాలపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త కె.రేవతి వైఎస్సార్ సీపీ రైతు నేత మూల్పూరి వెంకయ్య, మిల్క్ యూనియన్ డైరెక్టర్ సాయి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బీఎల్వోలకు శిక్షణ

పెడన: నియోజకవర్గంలోని బూత్ లెవల్ అధికారులకు ఈ నెల 5వ తేదీ నుంచి శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు పెడన నియోజకవర్గ ఏఈఆర్వో, ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశం హాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిక్షణ తరగతులకు 5న గూడూరు మండలంలోని ఒకటి నుంచి 50 బూత్‌లెవల్ అధికారులకు, 8న గూడూరు మండలంలోని 51 నుంచి 56 వరకు, పెడన టౌన్‌లోని వారికి శిక్షణ ఉంటుందని వివరించారు. 9న పెడన మండలంలోని వారికి, 10న బంటుమిల్లి మండలం, 11న కృత్తివెన్ను మండలం వారికి శిక్షణ తరగతులుంటాయని పేర్కొన్నారు. ఆయా మండలాల బీఎల్వోలు షెడ్యూల్ ప్రకారం శిక్షణ తరగతులకు హాజరు కావాల్సిందిగా ఆయన తెలిపారు.

నాగాయలంకలో రోజు విడిచి రోజు రక్షిత నీటి సరఫరా

నాగాయలంక: గ్రామ పంచాయతీ పరిధిలో కుళాయిలకు రక్షిత మంచినీటి సరఫరాను రోజు విడిచి రోజు గ్రామస్తులకు అందిస్తామని గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్ గురువారం తెలిపారు. పంట కాల్వలకు నీరు విడుదల అయిన నేపథ్యంలో కొత్తనీరు నింపే క్రమంలో రక్షిత మంచినీటి చెరువులో తూటుకాడ, చెత్తాచెదారం తొలగించే పనులు నిర్వహిస్తుండటంతో కుళాయిలకు రోజువారి నీటిని సరఫరా చేయడంలో అంతరాయం ఏర్పడిందని ఆయన వివరించారు. వారం రోజుల పాటు ఈ పరిస్థితి కొనసాగుతుందని కార్యదర్శి తెలిపారు.

సాగునీటిని వినియోగించుకోండి

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): సాగునీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని డీసీ చైర్మన్ బండ్రెడ్డి చినబాబు తెలిపారు.నాగాయలంక మండలంలో రైతాంగం కోసం వక్కపట్లవారిపాలెం లాకుల వద్ద గురువారం డీసీ చైర్మన్ బండ్రెడ్డి చినబాబు సెంట్రల్, సౌత్ చానల్స్ పంట కాలువలకు సాగునీరు విడుదల చేశారు. నీటిపారుదల శాఖ ఏఈఈ పొన్నూరు రవితేజ, పలువురు నీటి సంఘాల అధ్యక్షులతో కలసి తొలుత పూజ జరిపిన ఆయన సెంట్రల్ చానల్ లాకుల బావు తిప్పి సాగునీటిని దిగువకు విడుదల చేశారు. డీసీ చైర్మన్ మాట్లాడుతూ ఈ రెండు చానల్స్ ద్వారా మండలంలోని 37వేల ఎకరాల ఆయకట్టులో వ్యవసాయం సాగుతుందని, రైతులు సకాలంలో వ్యవసాయ పనులు చేపట్టి సాగునీటి వృథా నివారించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నీటి సంఘాల అధ్యక్షులు బండ్రెడ్డి నీలాంబరరావు, భోగాది రాజకుమార్, బావిరెడ్డి రవీంద్ర, అలపర్తి సుబ్రహ్మణ్యం, కొక్కిలిగడ్డ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


150 మందికి వైద్య పరీక్షలు



కొడాలి(ఘంటసాల): గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయం సేవలు అభినందనీయమని ఏఎంసీ మాజీ చైర్మన్ తుమ్మల చౌదరి బాబు అన్నారు. ఘంటసాల మండలం తాడేపల్లి – కొడాలి సెంటర్లోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి కల్యాణ మండపంలో కూచిపూడికి చెందిన రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయం ఆధ్వర్యంలో కూచిపూడి రోటరీ క్లబ్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. పలు విభాగాల వైద్యులు 150 మంది రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తుమ్మల వరలక్ష్మి, సంజీవిని వైద్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, రోటరీక్లబ్ ప్రెసిడెంట్ జొన్నలగడ్డ హనుమ కుమార్ పాల్గొన్నారు.

మచిలీపట్నంఅర్బన్: రాష్ట్రీయ బాల స్వస్థ్యలో భాగంగా జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యాన స్థానిక బాలసదన్లో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహిళాభివద్ధి, శిశుసంక్షేమ సాధికారిక అధికారి ఎంఎస్ రాణి పర్యవేక్షించారు. వైద్యులు శ్రీజ, రత్నకుమారి బాలలకు వైద్య పరీక్షలు చేశారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం



కృత్తివెన్ను: కృత్తివెన్ను మండల యూటీఎఫ్ కార్యవర్గంలో ఏర్పడ్డ ఖాళీలను నూతనంగా ఎన్నుకున్న వారితో భర్తీ చేసినట్లు ఎన్నికల అధికారి లెనిన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మండలం నుంచి కొందరు ఉపాధ్యాయులు బదిలీపై వేరే మండలాలకు వెళ్లిపోయారు. వారి స్థానంలో కార్యవర్గంలోకి కొత్త వారిని ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శిగా ఉండి పురుషోత్తం, సహాధ్యక్షులుగా చందు రంగనాయకులు, కార్యదర్శులుగా కేఎస్‌వీవీ సత్యనారాయణ, జె.శేషగిరిరావు, కె.మాధవీలతలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వీరాస్వామి, యుటీఎఫ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉర్దూ టీచర్లకు క్లస్టర్ స్కూల్స్

మచిలీపట్నంఅర్బన్: ఉర్దూ ఉపాధ్యాయులకు ఏకపక్షంగా క్లస్టర్ స్కూల్స్ కేటాయించారని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లాశాఖ అధ్యక్షులు పి ఇమ్మానుయేల్ తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం డీఈఓ రామారావుకు వినతి పత్రం సమర్పించారు. పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.